క్లుప్తంగా

నేడు కల్యాణోత్సవం

పెద్దతిప్పసముద్రం : స్థానిక శివాలయంలో శనివారం కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు సనగరం పట్టాభిరామయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాల్గుణ మాసం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జన్మ నక్షత్రం, స్వాతి నక్షత్రం సందర్భంగా కర్ణాటక రాష్ట్రం చింతామణి తాలూకా ఎగవకోట నుంచి ఉత్సవ విగ్రహాలు తెచ్చి శివాలయంలో నరసింహస్వామి కళ్యాణోత్సవం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.

ఆశ్రమ పిల్లలకు అన్నదానం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తుమ్మర కుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా సమితి సభ్యుడు మహేష్ కుమార్తె చంద్రిక పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేశారు. బెంగళూరులోని నందగోకుల ఆశ్రమంలోని 50 మంది పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

17న కురబలకోట సంత గేటు వేలం

కురబలకోట : మండల కేంద్రం కురబలకోట వారపు సంత, దినసరి మార్కెట్ గేటు వసూలుతో పాటు షాపింగ్ గదులకు బహిరంగ వేలం ఈనెల 17న పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సర్పంచ్ సుక్కా సుజాత శుక్రవారం తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా నిర్ణీత డిపాజిట్టు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

తంబళ్లపల్లె : స్థానిక టీఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ఐటీఐలో ప్రధానమంత్రి కౌసల్ వికాస్‌యోజన పథకంలో స్వల్పకాలిక కోర్సులలో శిక్షణ పొందేందుకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శేషారెడ్డి కోరారు. సెల్‌ఎం ప్లాయిడ్ టైలరింగ్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ సర్వేయర్, ఫిట్టర్ కోర్సులలో శిక్షణ ఇస్తారన్నారు.15-45 ఏళ్ల వయస్సు, 8వ తరగతి నుంచి 10వ తరగతి చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు స్థానిక ఐటీఐలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9491775422 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

రైల్వే రాయితీ పాసులు కొనసాగించాలని వినతి

మదనపల్లె సిటీ : సీనియర్ సిటిజన్స్‌కు రైల్వే రాయితీ పాసులు కొనసాగించాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి మదనపల్లె సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు మునిగోపాలకృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన వినతిపత్రం పంపారు. కోవిడ్ సమయంలో సీనియర్ సిటిజెన్స్‌కు రాయితీపాసులు నిలిపివేశారన్నారు. దూర ప్రాంతాలకు సీనియర్ సిజిజెన్స్ ప్రయాణిస్తున్నారు. రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరారు.

అధికారి వేధింపులపై ఫిర్యాదు

మదనపల్లె: పట్టణంలోని ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్న వెంకటరమణను కార్యాలయ క్లర్క్ నారాయణ వేధింపులకు గురి చేస్తున్నట్లు బాధితుడు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విధులలో భాగంగా నారాయణ తనను వేధింపులకు గురి చేయడమే కాకుండా అవమానకరంగా మాట్లాడుతూ, కులం పేరుతో దూషిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇదే విషయమై డీవైఈఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. వన్ టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

వేలం వాయిదా

నిమ్మనపల్లె : మండల పరిధిలోని తవళం గ్రామ పంచాయతీకి చెందిన చేపల చెరువుల వేలం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ లీలామాధవి, సర్పంచ్ రెడ్డప్ప ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం వేలం పాట నిర్వహించాల్సి ఉండగా స్థానికులు ముందస్తు సమాచారం లేదని వేలం వాయిదా వేయాలని కోరినట్లు తెలిపారు. 14న వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మి నరసింహ స్వామి తిరునాల



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ములకలచెరువు: మండలంలోని కదిరినాథుని కోటలో వెలసిన శ్రీ లక్ష్మి నరసింహస్వామి తిరునాలను శుక్రవారం నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

మహిళా లోకానికి స్ఫూర్తి సావిత్రిబాయిపూలే



మదనపల్లె సిటీ : సావిత్రిబాయి పూలే చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, బాస్ నాయకులు



పీలేరు : సావిత్రిబాయిపూలే వర్ధంతిలో వివిధ సంఘాల నాయకులు



వాల్మీకిపురం: నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

- ఘనంగా వర్ధంతి కార్యక్రమాలు
- ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా

మదనపల్లె సిటీ : తొలి మహిళా ఉపాధ్యాయునిగా అవతరించిన సిసలైన చదువుల తల్లి సావిత్రీబాయి పూలే స్ఫూర్తిని మహిళా లోకం మరువరాదని ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక బాస్ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే వర్ధంతి వేడుకలు జరిగాయి. మొదట సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్త్రీజాతికి, సూద్రులకు విద్య నేర్పడం కోసం తొలి మహిళా ఉపాధ్యాయునిగా అవతరించినట్లు తెలిపారు. ఆమె స్ఫూర్తితో ప్రతి మహిళా స్వీయ గౌరవం ప్రదర్శిస్తూ సంఘ సంస్కరణ కోసం తన వంతు కృషి చేసి దేశాభివృద్ధికి తోడ్పాటును అందించాలని పిలుపునిచ్చారు. బాస్ వ్యవస్థాపకులు పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ దేశానికి బహుముఖ సేవలందించినట్లు కొనియాడారు. స్ఫూర్తి వంతమైన ఆమె జీవితాన్ని పాఠ్య పుస్తకాల్లో ముద్రించడం ద్వారా దేశాభ్యుదయానికి కృషి చేయాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, సహదేవరెడ్డి,బాస్ నాయకులు రెడ్డప్ప, కృష్ణ, జనార్ధన్, గంగాధర్, క్రాంతి, రెడ్డిప్రసాద్, చంద్ర, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..

పీలేరు : ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణికుమార్ మాట్లాడుతూ మహిళాశక్తికి ఆమె ఒక నిదర్శనమని పేర్కొన్నారు. స్త్రీలకు చదువు చెప్పి, వారిలో చైతన్యం నింపిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. మహిళలు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాలకుంట శ్రీనివాసులు, మల్లికార్జున, ప్రసాద్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో..

వాల్మీకిపురం : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయినీ సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక తరిగొండ రోడ్డులోని మైనార్టీ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూణేలో మొట్ట మొదటిగా బాలికల పాఠశాలను ప్రారంభించి పీడిత ప్రజలు, స్త్రీల విద్యాభివృద్ధికి జీవితాంతం కృషి చేసిందన్నారు. బాల్యవివాహాలకు, మూఢనమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగా ఉద్యమం నడిపిన గొప్ప మహిళ అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమామంజుల, అధ్యాపకులు లోకనాధం, సురేంద్ర, ఖాజాబి, పూర్ణిమ, సుధారాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట : సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక ఉర్దూ హైస్కూల్‌లో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఈవో రెడ్డిశేఖర్ మాట్లాడుతూ మహిళా విద్యకోసం సావిత్రిబాయి ఎన్నో ఉద్యమాలు చేసిందన్నారు. తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా మహిళల కోసం ప్రత్యేక పాఠశాలలను ప్రారంభించారన్నారు. హెచ్‌ఎం చెంగల్రాయులు, ఉపాధ్యాయులు నూర్జహాన్, ఫరిదా, బషీర్, బాస్ నాయకులు సచిన్, మాధవ, మహేష్, గంగాద్రి, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు సురక్షితం

జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య

కలకడ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు సురక్షితంగా చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కలకడ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు. అనంతరం మండలంలోని బాలయ్యగారిపల్లె సచివాలయం పరిధిలోని హెల్త్‌క్లినిక్ పరిధిలో మురుగునీటి కాలువ దుర్గంధం వెదజల్లుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేయడంతో పంచాయతీ సిబ్బందిపై మండిపడ్డారు. పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్య సిబ్బంది పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి నీరు నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో సిబ్బంది అందుబాటులో ఉండి గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో ఫీవర్ సర్వే జరుగుతోందని,, 75శాతం పూర్తి చేయినట్లు చెప్పారు. నెలాఖరులోపు వందశాతం పూర్తి చేయడానికి కృషి చేసినట్లు తెలిపారు. 14వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియ నివారణ అధికారి డాక్టర్ వేణుగోపాల్, కలకడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున, ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశు, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, ఆరోగ్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యం నిర్దేశించుకొని చదవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నాగార్జునరెడ్డి

పీలేరురూరల్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యం నిర్దేశించుకుని చదవాలని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె. నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివాలన్నారు. అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించి కళాశాలకు, గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ సుధానంద్‌రెడ్డి, కవులు నారాయణస్వామి, మురళీధర్‌రాజు, డైరెక్టర్లు జనార్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌నాయుడు, లోకేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జేఎన్టీయూ కళాశాల వార్షికోత్సవం



మానవహారం నిర్వహిస్తున్న జేఎన్టీయూ విద్యార్థులు, అధ్యాపకులు

కలికిరి : జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల 10వ వార్షికోత్సవ ఉత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం కళాశాల నుంచి విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కలిసి గాంధీ కూడలి వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ కళాశాల దశాబ్ద వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు వివిధ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, పాటల పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ సి.సుభాష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో జేఎన్టీయూ విద్యార్థినుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో అధ్యాపకులు

కలికిరి : జేఎన్టీయూ 11వ అంతరాష్ట్ర క్రీడా పోటీల్లో కలికిరి కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 4 నుంచి 6 తేదీలలో నెల్లూరు జిల్లాలో జరిగిన వాలీబాల్, త్రోబాల్, షటిల్ బ్యాట్‌మింటన్ విభాగాల్లో కళాశాల విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించారన్నారు. జాతీయ విద్యా విధానం-2020లో భాగంగా విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని ప్రోత్సహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అనంతరం క్రీడలలో ప్రతిభ చాటిన విద్యార్థినులను అభినందించారు. భవిష్యత్తులో మరింత సత్తాచాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుభాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గంగయ్య

కలికిరి : ఈ నెల 14న జరుగనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని సమష్టిగా విజయవంతం చేద్దామని ఎంపీడీఓ గంగయ్య అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య సిబ్బంది, కార్యదర్శులు, ఐసీడీఎస్, విద్యాశాఖ సబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరం నుంచి 19 సం.లోపు పిల్లలు ప్రతి ఒక్కరికి ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని, ఇందుకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి కావ్యగంధ, ఐసీడీఎస్ సూపర్వైజర్ మహాలక్ష్మి, ఏఎన్‌ఎంలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

కేవీపల్లె : చిన్నారుల ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లేళ్లమంద వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న నులిపురుగుల నివరాణ దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఒకటి నుంచి 19 సంవత్సరాలు లోపు వయస్సు కల్గిన పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు మధ్యాహ్నం భోజనానంతరం వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్, వైద్యాధికారి డాక్టర్ పావనిగారి, ఆరోగ్య పర్యవేక్షకులు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

అరుదైన ఆపరేషన్

– కీ హోల్ సర్జరీతో రాళ్ల తొలగింపు

మదనపల్లె సిటీ : ఓ వృద్ధుడికి మూత్రపిండంలో రాళ్లు అధికంగా ఉండటంతో కీ హోల్ ద్వారా అరుదైన సర్జరీ చేసినట్లు ప్రముఖ యూరాలజిస్టు డాక్టర్ సనత్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఆద్య కిడ్నీ కేర్ సెంటర్‌లో మదనపల్లె మండలానికి చెందిన తిరుపాల్ నాయక్ వీపులో నొప్పితో బాధపడుతుండగా పరీక్ష చేసినట్లు తెలిపారు. మూత్రపిండంలో రాళ్లు ఉన్నట్లు గుర్తించి కీహోల్ సర్జరీ ద్వారా సుమారు మూడు వేలకుపైగా రాళ్లను తొలగించినట్లు తెలిపారు. డాక్టర్ పావనితో కలిసి ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పేషెంట్ కోలుకుంటున్నట్లు తెలిపారు.

అభివృద్ధిని చూసి ఎమ్మెల్సీ అభ్యర్థులను ఆదరించండి



కేవీపల్లెలో ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



పెద్దతిప్పసముద్రంలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి

కేవీపల్లె : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న అభ్యర్థులను ఆదరించాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కేవీపల్లెలో కరపత్రాలు అందజేసి ఓటర్లను అభ్యర్థించారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి యువత అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా వేలాదిమందికి ఉద్యోగం కల్పించారని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అఖండ మెజారిటీతో గెలిపిద్దాం

పీలేరు : ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపిద్దామని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఎం ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, పార్టీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ ఆనంద్ పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి

మదనపల్లె సిటీ : మొదటి ప్రాధాన్యత ఓటు వైఎస్సార్ సీపీ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నేటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలను వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ వైస్ చైర్మన్లు జింకా వెంకటాచలపతి, నూర్‌ఆజామ్‌లు తెలిపారు. శుక్రవారం మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలో పలువురు వార్డు కౌన్సిలర్లు ఆయా వార్డుల్లో ఓటర్లను కలిసి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. వైస్ చైర్మన్ జింకా చలపతి, వైస్ చైర్మన్ నూర్ అజామ్‌లు 11వ వార్డు పరిధిలోని బసినికొండ, రాజీవ్‌నగర్ ప్రాంతాలతో పాటు అప్పారావువీధి, దక్కిపేట ప్రాంతాల్లో పర్యటించి వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేయాలని కోరారు.

జగనన్న నాయకత్వాన్ని బలపరచండి

వాల్మీకిపురం : ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేయడం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని గండబోయనపల్లి సర్పంచ్ గుర్రప్ప కోరారు. శుక్రవారం మండలంలోని గండబోయనపల్లిలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పట్టభద్రులను కలసి వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

పేర్నాటిని గెలిపించండి

పెద్దతిప్పసముద్రం /పెద్దమండ్యం : వైఎస్సార్‌సీపీ బలపరచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, పద్మశాలి డైరెక్టర్ సురేంద్రలు కోరారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పీటీఎంలో పర్యటించి పేర్నాటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. అలాగే పెద్దమండ్యం మండలంలో స్థానిక నాయకులతో కలసి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు.

శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించండి

ములకలచెరువు /తంబళ్లపల్లె / కొత్తకోట : పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పెర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని తంబళ్లపల్లె నియోజకవర్గ పరిశీలకులు ఇరగంసుబ్బారెడ్డి ఓటర్లకు అభ్యర్థించారు. శుక్రవారం ఆయన మండల ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ములకలచెరువులో ప్రచారం నిర్వహించారు. అలాగే తంబళ్లపల్లె, బి.కొత్తకోట మండలంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఓటర్ల ఇళ్లవద్దకే వెళ్లి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

నిమ్మనపల్లెలో విస్తృత ప్రచారం

నిమ్మనపల్లె : మండల పరిధిలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డిలకు మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ రమణారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ రామమోహన్‌రెడ్డి, సింగిల్‌విండో రెడ్డిశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాజంపేట పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కొమ్మేపల్లి శ్రీనివాసులురెడ్డిల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

విస్తృత ప్రచారం

కలికిరి : వైఎస్సార్‌సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని శుక్రవారం మండలంలో వైఎస్సార్‌సీపీ నేతలు విస్తృత ప్రచారం చేపట్టారు. కలికిరి పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాల్లో ఓటర్లను కలిసి అభ్యర్థించారు.

రామసముద్రంలో..

రామసముద్రం : ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి పేర్నిటిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. శుక్రవారం అన్ని గ్రామ పంచాయతీలలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు.

వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణంలోని వీధి వ్యాపారులకు శుక్రవారం వాసవీ క్లబ్ వారు గొడుగులు పంపిణీ చేశారు. వీధుల్లో వ్యాపారులు చేసే వారు ఎండకు ఇబ్బంది పడకుండా గొడుగులు పంపిణీ చేసినట్లు వాసవీ క్లబ్ అధ్యక్షురాలు నరేంద్ర కుమార్ తెలిపారు. క్లబ్ సామాజిక కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి అశోక్‌కుమార్, కోశాధికారి లక్ష్మీపతి జయంతి,శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పుష్ప పల్లకీపై శ్రీచంద్రశేఖరస్వామి



పుష్పపల్లకీపై ఊరేగుతున్న స్వామివారు

రామసముద్రం : మండల పరిధిలోని దిగువపేటలో వెలసిన శ్రీచంద్రశేఖర్‌స్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారిని పుష్పపల్లకీపై ఊరేగించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. అలాగే చెంబకూరులో వెలసిన శ్రీ గట్టు వెంకటరమణస్వామి ఉత్సవాలలో భాగంగా దీపోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే నరసాపురంలో వెలసిన ముక్కేంటేశ్వరస్వామి ఉత్సవాలు శయణోత్సవంతో ముగిశాయి.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



చేతిబోరు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరు రూరల్ : వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని బలిజవీధిలో హ్యాండ్‌బోరు మరమ్మతులు చేపించారు. పనులు పర్యవేక్షించిన సర్పంచ్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వీధులకు సక్రమంగా పంచాయతీ నీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు స్కీంబోర్లు రిపేరు తోపాటు పైపు లైన్లు మరమ్మతులు చేస్తున్నట్లు చెప్పారు. ముందస్తు చర్యల్లో భాగంగా చేతుబోర్లు కూడా అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డిప్రసాద్‌రెడ్డి, వార్డు మెంబర్లు అబీద్, హబీబ్ బాషా, మునీర్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు వేగంగా ఏర్పాట్లు

పీలేరు రూరల్ : ఈ నెల 13న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ రవి, సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వారు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో విద్యుత్ సౌకర్యం, తాగునీరు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. పట్టభద్రుల ఓటర్లు కోసం నాలుగు బూత్‌లను, ఉపాధ్యాయులకు ఒక బూత్ కేటాయించినట్లు చెప్పారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

